క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: మండలంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. బేస్తవారిపేట-2 సచివాలయం పరిధిలో ఎస్సీ (జనరల్), చెట్టిచర్ల బీసీ (జనరల్), ఖాజీపురం ఓసీ (జనరల్) కు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం, 20న ఇంటర్వ్యూలు నిర్వహణ, 21న నియామక పత్రాలు అందజేయనున్నట్లు వివరించారు.

ఈకేవైసీతోనే పీఎం కిసాన్ లబ్ధి

తాళ్లూరు (ముండ్లమూరు): పంట సాగు చేసిన రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని రెడ్డిసాగర్‌లో ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతుల వద్దకు వ్యవసాయ సిబ్బంది వెళ్లి గురువారం ఈకేవైసీ చేయించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో రైతులకు పీఎం కిసాన్ నిధులు వస్తున్నందున అర్హతగల రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రెడ్డిసాగర్, అయ్యలపాలెం గ్రామాలకు చెందిన 785 మంది రైతులు ఈకేవైసీ వేయించుకోవాల్సి ఉండగా వారిలో 476 మంది రైతులు వేరే ప్రాంతాల్లో ఉంటూ స్పందించడం లేదన్నారు. వీఏఏలు శ్రీను, సుల్తాన, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

సాంకేతిక సహాయకుడిగా బలరామయ్య

ముండ్లమూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుడిగా పి.బలరామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడి సాంకేతిక సహాయకులు సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో దర్శిలో పని చేస్తున్న బలరామయ్యకు ఆ శాఖ జిల్లా అధికారులు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన గురువారం ఎంపీడీఓ హనుమంతరావును కలిసి నియామక పత్రం అందజేశారు.

నేడు వైద్య శిబిరం

పెద్దారవీడు: మండలంలోని బద్వీడు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఐటీడీపీ, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో ఒంగోలు అవినీష్ కిడ్నీ సెంటర్, ఎంపీఎం ఆర్థోపెడిక్ వైద్యశాల శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరోగ్య మిత్ర చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. వైద్యశాల డాక్టర్లతో కిడ్నీ వ్యాధులు, జనరల్ మెడిసిన్, ఎముకలు, నరములు, కీళ్ల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొనకనమిట్లలో..

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్లలో శుక్రరం పొదిలి పట్టణంలోని ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఉడుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, స్త్రీల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కొనకనమిట్ల పరిసర గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అశోక్‌రెడ్డి కోరారు

నేడు 'నీ గానమే నా ప్రాణం'

యర్రగొండపాలెం: స్థానిక వినుకొండ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం నీ గానమే నా ప్రాణం అఖండ భజన కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు కాషాయ ధ్వజారోహణంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసు, ప్రచార కార్యదర్శి హరినారాయణ, కోశాధికారి రంగాచారి, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు డప్పు శ్రీను పాల్గొంటారని పేర్కొన్నారు. అఖండ భజన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 20 ఎంట్రీలు వచ్చాయని, భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని యడవల్లి సచివాలయం పరిధి అంకిరెడ్డిపల్లె, యడవల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొంటారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీపీఆర్ టీకాలు వేయించాలి

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు పీపీఆర్ టీకాలు వేయించాలని ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. గొర్రెలు, మేకలకు సోకే భయంకరమైన వ్యాధుల్లో చీడ పారుడు వ్యాధి ఒకటని, ఈ వ్యాధి జీవాలకు సోకితే యజమానులకు ఎక్కువ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. మార్‌బిల్లీ వైరస్ జీవాలకు సోకడం వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. అవి మందలో ఉన్నపుడు, మరో మందలో కలిసినపుడు ఎక్కువ జీవాలకు వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. అక్టోబర్ 10వ తేదీ వరకు టీకాలు వేస్తామన్నారు.

సంక్షేమంలో రాజకీయాలు చూడం

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల పంపిణీలో రాజకీయాలు కానీ, పార్టీలు కానీ చూసేదిలేదని, అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎస్సీ బీసీ కాలనీలోని వెలుగు కార్యాలయంలో నూతన పింఛన్ల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు పొందాలంటే జన్మభూమి కమిటీ ఆమోదం తెలిపితేనే అందేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికమని స్పష్టం చేశారు. గ్రామాల్లో గడప గడపకు పర్యటించినప్పుడు ప్రజలు సంతోషంగా పథకాలు అందుతున్నాయని స్వచ్ఛందంగా తన దృష్టికి తెస్తున్నారన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, నాగ అరుణ, రంగలక్ష్మి, భాను, షెక్షావలి, శ్రీనివాసులు, ఎస్.కొండయ్య యాదవ్, కమిషనర్ గిరికుమార్, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

30 మందికి నూతన పింఛన్ల పంపిణీ

తర్లుపాడు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగుతోందని మాజీ మండల కన్వీనర్, తాడివారిపల్లి సర్పంచ్ జాన్ రత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో నూతనంగా 30 మందికి మంజూరైన వైఎస్సార్ పింఛను కానుకను వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. నూతన పింఛన్లు మంజూరయ్యేందుకు సహకరించిన ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మేకల శ్రీనివాసరెడ్డి, వార్డు మెంబర్లు కెబాబు, పెద్దబాబు, నరసమ్మ, మరియమ్మ, జెబాబు, పార్టీ నాయకులు తాడి రామాంజనేయరెడ్డి, పి.శ్రీనివాసులు, బుగ్గారెడ్డి, సచివాలయ కన్వీనర్ దారా యేసు, సచివాలయం సిబ్బంది, వలంటీరు పాల్గొన్నారు.



తాడివారిపల్లిలో నూతన పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

కుష్టు వ్యాధిపై సర్వే

పుల్లలచెరువు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో కుష్టు వ్యాధిపై సర్వే చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలపై రాష్ట్ర కుష్టు వ్యాధి నిర్మూలన పరిశీలిన కమిటీ సభ్యుడు డాక్టర్ డి.సాంబిరెడ్డి గురువారం మండలంలోని పలు సచివాలయాలను సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం ఆదేశాలపై కుష్టు వ్యాధిపై వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేయాలని సూచించారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం అందించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధిగ్రస్తులకు పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 12 సచివాలయాల పరిధిలో గురువారం పర్యటించి పలు సూచనలు చేసినట్లు సాంబిరెడ్డి తెలిపారు. ఈయన వెంట పుల్లలచెరువు సీహెచ్‌ఓ అబ్దుల్ జలీల్ ఉన్నారు.

ఇడుపూరులో భూముల రీసర్వే ప్రారంభం

మార్కాపురం రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని ఇడుపూరు రెవెన్యూ గ్రామంలో గురువారం డ్రోన్ ఫ్లైని ఇడుపూరు, దరిమడుగు సర్పంచ్‌లు వెన్నా మహేశ్వరీ సుబ్బారెడ్డి, బట్టగిరి గౌతమీ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలు వెచ్చించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సంబంధించిన భూరికార్డులన్నీ డిజిటలైజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి వెంకట రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కె.పేతురు, వీఆర్‌ఓ బడే సాహెబ్, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏలు, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో మెరుగ్గా రాణించాలి

పొదిలి: ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. కేజీబీవీ, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటా పోటీగా క్రీడల్లో పాల్గొన్నారన్నారు. ఎంఈఓ-2 నాగలక్ష్మి మాట్లాడుతూ.. తాను స్వతహాగా వాలీబాల్ ప్లేయర్‌ను అన్నారు. క్రీడలంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరీమూన్‌బీబీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీవీ రెడ్డి, పీడీలు షకీల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జ

జాషువా జయంతి సభను జయప్రదం చేయాలి

దర్శి: గుర్రం జాషువా జయంతి సభను జయప్రదం చేయాలని రాష్ట్ర దళిత సేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్టీఓ పరిశిపోగు రవికుమార్ చేతులమీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ సంఘం, పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అన్నవరం వెంకటేశ్వరరావు, సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ గుర్రం జాషువా జయంతి సభ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరుగుతుందని తెలిపారు. దళిత ప్రజాసంఘాల నాయకులు గట్టుపల్లి ప్రసాద్, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, అడ్వకేట్ జోషి, గర్నెపూడి ప్రభాకర్, దొంతలూరి కోటేష్ పాల్గొన్నారు.

సురక్ష సర్వేకు సిద్ధంగా ఉండాలి

తర్లుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని తర్లుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.సింధూజ సిబ్బందికి సూచించారు. గురువారం పీహెచ్‌సీలో మండలంలోని మెడికల్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. వలంటీర్ల సహాయంతో ఏఎన్‌ఎంలు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి సంబంధిత వివరాలతో కేస్ షీట్లు తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, సిహెచ్‌ఓ, ఎమ్‌ఎల్‌హెచ్‌పి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

పుల్లలచెరువు: వ్యవసాయ పనులు పలు గ్రామాల్లో ఊపందుకున్నాయి. ఇటీవల అల్పపీడన ప్రభావంతో పలు గ్రామాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బోరు బావులు, చెరువుల్లో నీరు నిల్వ చేరింది. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంటను అధికంగా సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెర్వులకు నీరు రావడంతో వాటి కింద వరి పంటను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే గ్రామాల్లో పంటలు సాగు చేయడం ఆలస్యం కావడంతో ప్రస్తుతం పడిన వర్షాలకు అదును దాటి పోతుందోనని, మళ్లీ వర్షాలు పడతాయని ఆశలతో రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏల సంఘ నాయకులు స్థానిక ఏపీఎం నరేష్‌ను తన కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు గంగాదేవి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి గ్రామాల్లో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. కనీస వేతనాలు కల్పించాలన్నారు. గ్రూపు ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు కల్పించాలని, లోకాస్ యాప్ వర్క్ చేసేందుకు 5జి మొబైల్ అందజేయాలని కోరారు. వీఓఏ సంఘ నాయకులు భాగ్యలక్ష్మి, సైదాబీ, మాబునీ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత పేర్కొన్నారు. పోషణ మహోత్సవాల్లో భాగంగా గురువారం పెదారికట్ల అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వినియోగంతో కలిగే ఉపయోగాలను వివరించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాల నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, లక్ష్మి, షమీమ్, కనకదుర్గ, అంజలి, కోటేశ్వరి, అరుణ, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు తమ కాళ్లపై తాము జీవించాలి

దొనకొండ: గ్రామాల్లోని మహిళలు తమ కాళ్లపై తాము జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న పాల వెల్లువ ద్వారా రుణాలు పొందాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి కోరారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం అధికారులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బ్యాంక్‌లు తక్కువ వడ్డీతో గేదెలు కొనుగోలు చేసేందుకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారని, ఈ అవకాశాన్ని గ్రామాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ సెంటర్లకు తమ బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు ప్రభుత్వ కేంద్రాలకు పాలు పోసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డైరీ యూనిట్లకు 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ వసంతరావునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ కార్యక్రమం చేపట్టి ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడానికి రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి కరిష్మా, పాల వెల్లువ రూట్ అధికారి బాలయ్య, మహిళలు పాల్గొన్నారు.

పాల వెల్లువతో మేలు

ముండ్లమూరు: జగనన్న పాలవెల్లువ పథకంతో పాడి రైతులకు మేలు చేకూరుతోందని ఎంపీడీఓ హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పాడి రైతులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమూల్ పాలకేంద్రాలకు పాలు పోసే రైతులకు సహకార బ్యాంకు నుంచి గేదెల కొనుగోలుకు, వాటి నిర్వహణ కోసం ప్రత్యేక రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాలు పోస్తున్న రైతులు తమ ఆధార్ కార్డుతో బ్యాంకును సంప్రదిస్తే అర్హత ఆధారంగా రెండు లక్షల నుంచి పది లక్షల వరకు పాడిపరిశ్రమ రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఏపీఎం హనుమంతరావు, పశువైద్యాధికారి విజయలక్ష్మి, పీడీసీసీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సిద్ధయ్య, అమూల్ రూట్ ఆఫీసర్ మాలకొండయ్య, ఈఓఆర్డీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

యర్రగొండపాలెం: క్రీడలు ఆరోగ్యానికి, మానసిక వికాశానికి దోహదపడతాయని, విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకొని తమ నైపుణ్యతను చాటాలని ఎంఈవో పి.ఆంజనేయలు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు పెద్దారవీడులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలు, అక్కడి నుంచి జిల్లా స్థాయిలో పాల్గొంటారని, అక్కడ క్రీడాకారులను ఎంపిక చేస్తారని చెప్పారు.

వీఆర్వోను నిలదీసిన మహిళ

యర్రగొండపాలెం: తమ భూమి ఇతరులకు ఆన్‌లైన్ చేశారని మండలంలోని బట్టువారిపల్లె గ్రామానికి చెందిన అనంతలక్ష్మి తమ్మడపల్లి వీఆర్వో దీనావలిని గురువారం నిలదీసింది. గుర్రపుశాల పంచాయతీలోని లింగంవానిపల్లెకు చెందిన 72 సర్వే నంబర్‌లో 3.14 ఎకరాల భూమిని తమకు తెలియకుండా ఇతరుల పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించారని, ఇదేమిటని అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనంతలక్ష్మి ఆరోపించింది.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

ముండ్లమూరు: జాతీయ హిందీ భాషా దినోత్సవం గురువారం స్థానిక హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎల్.మాధవీలత మాట్లాడుతూ హిందీ మన జాతీయ భాష అయినందున ప్రతి ఒక్కరూ నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. 1949 సెప్టెంబర్ 14న హిందీని జాతీయ భాషగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో హిందీ భాషకు నాలుగో స్థానం ఉందన్నారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, హజరత్ ఆలీ, భారతి, శ్రీదేవి, ప్రభావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రిపురాంతకం: హిందీ జాతీయ భాషా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కరిముల్లా మాట్లాడుతూ హిందీ భాష జాతీయ భాషగా దేశంలో ఏ రాష్ట్రం వెళ్లినా మాట్లాడతారని చెప్పారు. ఉద్యోగ, వ్యాపారాభివృద్ధిలో ఇది ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, పాటలు, నృత్య, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హిందీ అధ్యాపకుడు పఠాన్ కరీం ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

తర్లుపాడు: మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతని మండలంలోని లక్ష్మక్కపల్లి హెచ్‌ఎం కస్సెట్టి జగన్‌బాబు అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. తన సొంత ఖర్చులతో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ముందు జేసీబీ సాయంతో రోడ్డును చదును చేయించి, చిల్లచెట్లను తొలగించారు. హెచ్‌ఎంను ఎంఈఓ డి.సుజాత, ఎంఈఓ-2 ఎ.సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

దొనకొండ: రైతులు వైఎస్సార్ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం రాగమక్కపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదుకు హాజరైన రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం కొత్తగా ఎవరైనా పొలాలు కొనుగోలు చేసినా, తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చినా పాస్ పుస్తకాలు పొందిన ఎవరైనా వైఎస్సార్ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురైన బాలుడికి పింఛన్

● ఎమ్మెల్యేకు బాలుడి తల్లిదండ్రుల కృతజ్ఞతలు



బాలుడికి పింఛను అందిస్తున్న ఇస్మాయిల్

మార్కాపురం: పట్టణంలోని చెన్నకేశవనగర్‌కు చెందిన పదేళ్ల బాలుడు పోసాని సుధీర్ మూడు నెలల క్రితం ఆడుకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగను పొరపాటున తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆ బాలుడిని వైద్యశాలకు తీసుకెళ్లి దగ్గరుండి చికిత్స చేయించారు. కాగా విద్యుదాఘాతానికి గురైన బాలుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మూడు వేల రూపాయల పింఛనును అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారు. నూతనంగా మంజూరైన పింఛనును గురువారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అందించారు. బాలుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి, వైస్ చైర్మన్ ఇస్మాయిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.